# ఆత్మ సాక్షాత్కారం

'ఇది అద్దెకివ్వబడును' బోర్డు చదువుతూ కళ్ళ జోడు ఫ్రేమును ఎడంచేత్తో మెల్లిగా క్రిందికీ పైకీ ఊగిస్తూ యేమిటి యీ 'సర్వనామము' అనుకుంటూ వుండగానే తలుపులు రెండూ బార్లగా తెరుచుకున్నాయి. చప్పున రెండు కళ్ళను బోర్డుమీదనుంచి క్రిందికి దించేశాడు. అదిరిపడ్డాడు ఆనందరావు. చూస్తూ చూస్తూండగానే గుమ్మంలోకి వచ్చినిలబడింది. ఓ యువతి. ఇరవై యిరవై అయిదేళ్ళ మధ్య వయస్సులో ఊగిసలాడుతోంది. ఆమె వాలకం చూస్తూంటే ఆయన కళ్ళు చిన్నవయి పోతున్నాయి. కళ్ళజోడు ఫ్రేమును గట్టిగా ముక్కుమీదికి నెట్టేసి గుటకలేస్తూ అమ్మాయ్ అనబోయి నోరు పెగలక గొంతు సవరించుకొంటూ అద్దెకిచ్చేదేనా అందామనుకుని యీ మాట బాగా ధ్వనించటం లేదని తనలో తాను సమాధాన పడి ఏమనాలో చప్పున తోచక 'యీ బోర్డుచూసి యిక్కడ ఆగిపోయానండీ' అన్నాడు. ఫరవాలేదులే. ఈ వాక్యంలో అట్టేతప్పుపట్టే ప్రమాదం యేమీలేదులే అని సంతృప్తి పడ్డాడు.

ఆ అమ్మాయి సకిలించినట్లికిలించి 'కిటికీలోంచి మిమ్మల్ని చూసే అమాంతం తలుపు తెర్చా' అంది.

ఆఁ ! ఎంత గడుసు పిల్ల! నన్ను కిటికీలోంచి చూసిందా! ఇదన్న మాట దీని పని అని క్రింది పెదిమను పళ్ళతో నొక్కి పెట్టి కాస్తగట్టిగా చిటపటా ఆలోచించి అట్టాగా అనబోయిలోపల గుణించు కుంటున్నమాటే 'ఆసి భడవా!' అంటూ పైకే అన్నాడు అప్రయత్నంగా. చప్పున నాలిక కరుచుకుని అబ్బయెంత మాటన్నాను అని పశ్చాత్తాప పడుతునట్లు కుడి చెయ్యి దభాలున క్రిందకు చాచి విదిలిస్తూ పెద్ద చిటికవేశాడు. ఆ అమ్మాయి కిలకిల నవ్వింది. రుసరుస మంటూ యేం గోలచేస్తుందో అను కుంటున్న ఆనందరావును ఆమె నవ్వులు పన్నీటి జల్లులాగ వళ్ళంతా పడి గిలిగింతలు పెట్టేసినాయి. ఇహ చనువు చేసుకుని లోపల ప్రవేశించాడు. ఓ ప్రదక్షిణం చేసినాలుగు గోడలు చూశాడు. ఆమె కూడా ఆయనతో పాటే ఒచుట్టు తిరిగింది. గోడమీద వేలాడుతున్న బొమ్మలు, ఫ్రేముల్లో యిరకాటంగా కుదించుకుపోయిన చిత్రాలుచూస్తుంటే ఆయన మనస్సు మనస్సులో లేదు.

కూర్చొండి. 'అమ్మగా రొస్తారు' అంటూ ఆమె యిట్టే లోపలికి వెళ్ళిపోయింది. ఆబొమ్మల్ని చూడబుద్ధి పుడుతోంది. కాస్త ఆలోచిస్తే చూడ కూడ దనుకుంటున్నాడు. ఏమయినా చూడాలనే గాఢమైన వాంఛ మాత్రం ఆయన్ను అంటి పెట్టుకునేవుంది. తీరా అట్టాగే ఆ ఫోటోలవంకే కళ్ళనిలి పితే అమాంతం లోపల్నుంచి వాళ్ళొస్తారేమోనని, తనను గమనిస్తారేమో అని జంకుతూ తటపటాయిస్తున్నాడు. కేవలం అవి అసభ్యకరమైనవి అని అనటానికి మనస్కొప్పడంలేదు. అయినా అంత నగ్నంగా ఆడవాళ్ళ చిత్రాలు గోడల మీద వేలాడటం ఆయనకు యిష్టంలేదు. ఇంత వరకు ఎప్పుడూ ఆయన అలాంటి చిత్రాలు చూడనూలేదు. ఆయన మనస్సు స్వైరవిహారం చేస్తోంది. అర్ధాంగి మంగమ్మ చప్పున కళ్ళల్లోకి వచ్చి ఆయన 'మూడ్' అంతా పాడుచేసేసింది. తల విదిలించేసుకుని కళ్ళ

గట్టిగా మూసుకొన్నాడు. భార్య ఏమిటో అంటున్నట్టు ఊహించుకుంటూ రెండు చేతుల్తోను రెండు చెవులకు మూతలు వేశాడు. చప్పున స్పృహ లోకి వచ్చి కనురెప్పలు టపటప మనిపించే టప్పటికి యువతులిద్దరూ చేతులు పూగించుకుంటూ రికామిగా వచ్చేస్తున్నారు. ఆయనకు మతిపోయి నట్లయింది. ఆ క్షణంలో వాళ్ళిద్దర్నీ చూస్తూ ఆగోడమీది బొమ్మలకూ యీ సజీవబొమ్మలకూ అట్టేతేడా ఏమీలేదను కున్నాడు. రెండుచేతుల్తోనూ అమాంతం మొహాన్ని కప్పేసుకుందా మనుకుని, యిది సభ్యతా లక్షణం కాదని సమాధానపడి కళ్ళు సగం మూసుకొని వాళ్ళవైపు సూటిగా చూట్టా నికి యిష్టపడక చూడకపోతే నిర్లక్ష్యం చేశాడనుకుంటా రేమోనని కళ్ళు బలవంతాన విప్పుకుని ఏం చూడ్డానికైనా సిద్ధపడే యిక్కడకు వచ్చాను అని నిశ్చయం చేసుకుని లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ కూడా పకపకా నవ్వారు. బహుశా తన అవస్థ అంతా యిట్టే గ్రహించి వుంటారని గట్టిగా అనుమానపడ్డాడు. ఇంకా నవ్వుతూనే వున్నారు. నిజానికి అంతగా నవ్వాల్సిన పనేమీ లేదు. ఆ నవ్వుకు అర్థం లేదు. అవును ఏమీ కారణంలేనిదే ఆడది నవ్విందంటే యేదో కారణంవుండి తీరాలి. అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

వాన వెలిసినట్టు చప్పున నవ్వు లాగి పోయినాయి.

'ఈమె నా సెక్రటరీ' అన్నది ఆమె. ఈమె నీ సెక్రటరీ సరేలే అసలు నువ్వెవరంట అని లోపల ప్రశ్నించుకుని బైటకు మాత్రం ఓహో అట్లాగా అన్నాడు.

'ఇంతకీ మీరు చూస్తారా!' అన్నది ఆమె.

'ఏమిటని ప్రశ్న వెయ్యటం అంత బాగా లేదనుకుని చూపించేదేదో చూస్తే సరిపోతుందిలే అనుకుంటూ, అయినా అద్దెకిచ్చే గది చూపిస్తుంది.

అంతకంటే యేమిటిలే అన్నింటికీ అనుమానాలు సందేహాలూను అని మనస్సు కుదట పరుచుకుని, 'అందుకేగా వచ్చిందీ' అన్నాడు.

గభాలున ఆమె రివాల్వింగ్ కుర్చీలో కూలబడి గిరగిర తిరుగుతుంటే ఈమె ఆమె కళ్ళల్లోకి తల అటూఇటూ తిప్పుతోంది. ఆనందరావు కళ్ళు గిర్రున తిరిగినాయి. తిరిగేది ఆ కూర్చీయా తానా అనే అనుమానం కలిగింది. రంగులరాట్నం ఆగినట్టు ఆగిపోయింది. ఆమె సూటిగా ఆయన మొహంలోకి చూస్తూ 'చూడండీ మూన్నెళ్ళ అద్దె అడ్వాన్సు యివ్వాలి. నెలకు నూటయాభై రూపాయలు. పగలంతా యెక్కడ తిరిగినా రాత్రిళ్ళు మాత్రం పెందరాళె రావాలి. రాత్రి తొమ్మిదయ్యేటప్పటికి దీపాలు ఆరిపోతాయి. ఆ తర్వాత లైటు కావాలంటే ఎక్స్ట్రా. ఇదేమీ రహదారి బంగళాకాదు. ఎంతమంది వుంటారో ముందరే చెప్పాలి. అంతకుమించి కానీ తక్కువగాని వుంటానికి వీల్లేదు. మాకు నచ్చకపోతే మీరు ఖాళీ చెయ్యాల్సిందే. మీ కిష్టంలేకపోతే బలవంతం లేదు. అయితే ఓ నెల నోటీసు ముందుగా ఇవ్వాలి. ఇంకా మిగతా షరతులు మామూలే. ఇదీ ఎగ్రిమెంట్ ఖాళీలు పూర్తిచేసి సంతకం పెట్టేసెయ్యండి – మూడు వైపు కొట్టిన దళసరి కాగితాలు ఈమె ఆమె చేతిలోంచి తీసుకొని ఆయన కిచ్చింది.

ఆనందరావుకు మూర్ఛవచ్చినంత పనయింది. కళ్ళజోడు ముక్కుదూలం మీదే వుంది. కాగితాలు చూస్తున్నాడు. కాని యేమీ కనిపించటం లేదు. అయినప్పటికి చదువుతున్నట్టే కాగితం తీసి కాగితం క్రింది పెడుతున్నాడు.

'ఇంతకీ సభ్యులెంతమందో చెప్పారు కాదు.' ఆమె సంజ్ఞ గ్రహించి ఈమె అడిగింది.

ఇందాక వచ్చినతర్వాత ఇహవెనక్కి తగ్గేదిలేదని నిశ్చ

యం చేసుకొని 'పాతికమంది' అంటూ ముప్పయి రెండు పళ్ళూ బైట పెట్టాడు.

'ఆఁ!' అంటూ ఇద్దరూ గుండెల మీద చెయ్యివేసుకున్నారు. ఆ నాలుగు కళ్ళూ యేవో మాట్లాడుకున్నాయి. ఈమె ఆయన చేతిలోంచి కాగితాన్ని అమాంతం లాక్కుంది.

'నాకూ ఫామిలీ ప్లానింగ్‌లో పూర్తి విశ్వాసం వుంది. ఆ పాతిక మంది నా పిల్లలు కాదు. ఇహపోతే నేనొక పవిత్రమయిన ఆశయంతో వచ్చాను. ఒక పాతిక మంది యువతీ యువకులను గొప్ప ఆదర్శవాదులుగా తయారు చేయటానికి కంకణం కట్టుకున్నాను. ఈనాటి కల్లోలిత ప్రపంచంలో కలుషిత వాతావరణంలో నైతికశక్తి దిగజారి పోతోంది. వాస్తవ ప్రపంచంలో సూత్రాలకు, సిద్ధాంతాలకు విలువ యివ్వలేక పోతున్నాము. ఎక్కడ చూచినా హాహాకారాలు, నిస్పృహ, నిరాశ, నిస్తేజము యివే కనిపిస్తున్నాయి. జాతిని ఉత్తేజపరిచి కార్యోన్ముఖుల్ని చెయ్యటానికి యెంత చిన్నదైనా ఒక ప్రయత్నం అంటూ చెయ్యాలి. అలాంటిదే నేను తలపెట్టాను. కక్షీ, లంచగొండితనం యీ రెండూకూడా మనల్ని పీల్చి పిప్పి చేసేస్తున్నాయి. ఈ దాస్యశృంఖాలల్నుంచి మనం బైటపడాలి. దానికి ఎవరికివారే తమ కర్తవ్యం యేమిటో నిర్ణయించుకోవాలి. ముఖ్యంగా నైతిక విలువల ప్రాధాన్యం, ప్రాముఖ్యత యువతరానికి నూరిపోస్తే మన జాతి పురోగమిస్తుందని నా గాఢమైన విశ్వాసం. గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతం మీరు వినేవుంటారు. అదే ట్రస్టీషిప్ అంటారు. సంఘపరమైన డబ్బంతా భాగ్యవంతుల దగ్గర దాచి వుంచబడింది. అది వారి అవసరాలకు ఖర్చు చెయ్యాల్సిందే గాని, ధనవంతులు కేవలం వాళ్ళ భోగభాగ్యాలకు, విలాసాలకు దుబారా చెయ్యటానికి కాదు, అది సిద్ధాంతం. అట్లాగే నాలో వున్న విజ్ఞానం ప్రజల సొత్తు. దాన్ని యితరులకు పంచి పెట్టాలి. ఇదే

నా ముఖ్యోద్దేశం. పాతికమంది యువతీ యువకులు నా దగ్గర శిక్షణ పొందటానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ళను ఒకచోట చేర్చి నా కార్య క్రమాన్ని రూపొందించాలి అందుకే నాకు యిల్లు కావాల్సి వచ్చింది!' ఉద్రేకం, ఆవేశంతో ఊగిపోతున్నాడు ఆనందరావు.

వాళ్ళిద్దరూ గుడ్లు అప్పచెప్పి నిశ్చేష్టులయి అట్లాగే కూర్చుని పోయారు. ఆయన గొంతు సవరించుకుంటూ మళ్ళీ మొదలెట్టాడు.

'కొన్ని నియమాలున్నాయి. అబద్ధం ఆడకూడదు. మద్యం సేవించ కూడదు. ఇహ మూడోది చెప్పటానికి మీరు సిగ్గుపడతారేమోనని నేను వెనకాముందు ఆలోచిస్తున్నాను.' మెల్లిగా తలవంచుకుని గుటకలు వేస్తున్నాడు.

వాళ్ళేమీ మాట్లాడలేదు. మీరు చెప్పదలుచుకుందేమిటో చెప్పే సెయ్యండి అన్నట్టుగా ఆయనవైపే దృష్టులు కేంద్రీకరించారు. కళ్ళు పైకెత్తి వాళ్ళివైపుకు చూస్తూ వాళ్ళ శరీరాల్ని యింకా దాచుకోవాల్సిన ఆవశ్యకతను గురించి చెప్పాలనుకుని యిప్పుడే యింత చనువు తీసుకో వటం అట్టే బాగా లేదని ఆ ప్రయత్నాన్ని విరమంచుకుని, 'మా నియ మాలు మీరుకూడా పాటించేటట్లయితే ఆ గ్రూపులో చేరొచ్చు' అన్నాడు ముక్తసరిగా, తన భావాన్ని యీ విధంగా వాళ్ళకు అర్థమయ్యేటట్టు చెప్పాననే ధీమాతో.

ఆమె చాలా వింతగా ఆయన మొహంలోకి సూటిగా చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తోంది. ఏమేమిటో గుర్తుకొచ్చి ఆమె మొహం కంది పోతోంది. పెద్దగా నిట్టూరుస్తూ అలసట పడిపోతోంది. తమాయించుకుని కళ్ళు తుడుచుకుంటూ 'మా ఆడవాళ్ళు మీ గ్రూపులో చేర లసిన అవ సర మేమీ లేదు. మేము యెప్పుడూకూడా నైతికంగా పతనం కాలేదు.

మా అంతట మేము ఆత్మద్రోహం చేసుకోలేము. బలహీనతలకు మేము అతీతంగా వుంటూ నిబ్బరంగానూ, ధైర్యంగానూ వుంటాము. కాని మమ్మల్ని మీరే మీ మగవారే అట్లా వుండనీరు. మమ్మల్ని అనుక్షణం వెంటాడి మనస్సులు మలినం చేసుకుని అధోగతిపాలై సహనానికి, శీలానికి స్వస్తిచెప్పి చిట్టచివరకు అదిగో పతితవని మమ్మల్ని వేలుపెట్టి చూపిస్తారు. నిజానికి పతితలం మేము కాము. మీరు! దిగజారిపోయిన మనుషులు మీరు. ఆనాడు మా అమ్మను నమ్మించి పెళ్ళిచేసుకుంటానని మాటయిచ్చి, యెన్నెన్నో ఆశలుపెట్టి చివరకు వదిలేసి వెళ్ళిపోయాడు. మా అమ్మ కృంగి కృశించిపోయి ఏళ్ళు ఆయనకోసం ఎదురుచూస్తూ చివరకు కళ్ళు మూసింది. లోకం మా అమ్మకు పతిత అని బిరుదు యిచ్చింది. నా తండ్రి యెవరో నేను తెలుసుకోలేని దుస్థితిలో నన్ను వెలివేసింది, ఆయనమాత్రం పెద్దమనిషి, సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు వున్న వ్యక్తిగా చలామణి అవుతూనే వున్నాడు. ఎవడు దోషి? ఎవడు నిర్దోషి? నిర్ణయించే దెవరు? ఇదా సంఘం? ఇదా మన సంప్రదాయం? నేను సహించను, సహించలేను. ఎంతమంది మగవాళ్ళను అల్లరిపాలుచేస్తే అంత నా మనస్సుకు శాంతి. అదే నా ధ్యేయం, అదే నా లక్ష్యం. నా వేషం చూసి మీరు అపోహపడకండి. నేను పతితను కాను. మా అమ్మ అంతకంటె కాదు' ... వెక్కి వెక్కి ఏడుస్తూ మొహాన్ని చేత్తో కప్పుకుని విలవిలలాడి పోతోంది.

ఆనందరావు నిర్జీవి అయిపోయాడు. నోట మాటరావడం లేదు. కాళ్ళూ చేతులూ వణికిపోతున్నాయి. ముచ్చెమట్లు పోస్తున్నాయి. గొంతుక ఎండిపోతోంది. ఈమెను ఓదారుస్తున్నట్లు ఆమె తలను నిమురుతూ లేవండమ్మా అంటోంది. ఆమెక్కూడా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. కళ్ళద్దుకుంటూ 'మా అమ్మగారి మనసు మంచిది. ఆమెకు తండ్రి

యెవరో తెలీదనే ఉక్రోషంతో యేమేమిటో చేస్తూ వుంటుంది. ఎంతో మంది మగవాళ్ళను అవమానపరచి పంపుతూ వుంటుంది. ఎవరొచ్చినా వాళ్ళతో గంటలతరబడి మాట్లాడుతూ చివరకు ఆయన దిగజారిపోయే పరిస్థితి వచ్చేప్పటికి చెంపదెబ్బకొట్టి పంపిస్తూ వుంటుంది. వాళ్ళు హడలిపోయి పారిపోతూ వుంటారు. ఆమె ప్రవర్తన అంతా వింతగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు నాకే అర్థం కాదు...' ఆనందరావు చెంపమీద చెయ్యి పెట్టుకుని ఉలిక్కిపడ్డాడు. ఆయనవైపుకు జాలిగా చూస్తూ 'మా అమ్మగారు చాలా ఉత్తమురాలు. మీబోటి పెద్దమనుషుల్ని యేమీ చెయ్యరు. ఇవ్వాళ్ళ యేమిటో మరీ మిమ్మల్ని చూడంగానే ఆమెగారి మనస్సులోని ఆవేదనంతా చెప్పుకుంది. ఇట్లా యెవ్వరితోనూ ఆమె మాట్లాడదుకూడా... అమ్మగారూ లేవండి...' అంటోంది.

ఆనందరావు క్రుంగిపోయి కుర్చీలోంచి క్రిందకు పడబోయాడు. ప్రక్కగోడ పట్టుకుని రొప్పుతున్నాడు. ఆమె మెల్లిగా తలెత్తి ఆయాసపడుతూ ఆయన మొహంలోకి చూసింది. ఆయన దిద్దరిల్లిపోయాడు. ఆమె మొహంలోకి చూడలేకపోతున్నాడు.

'నే నింతగా అన్నానని మీరేమీ అనుకోకండి. మీ రన్నమాటలు వినంగానే ఆవేశం, ఉక్రోషం ఆపుకోలేకపోయాను. అంతే. మీతో చెప్పిన తర్వాత నా మనస్సు కొంత కుదుటపడింధి. నా ఆవేదన కాస్త తగ్గినట్లు అనిపిస్తోంది. మీరు పెద్దవారు, నా బాధను అర్థం చేసుకుంటారని చెప్పాను. అంతే... అంతే...' అన్నది ఆమె.

ఆనందరావు మనస్సులో తీవ్రంగా కల్లోలం చెలరేగింది. హృదయం బ్రద్దలయ్యేటంత ఉద్రేకం ఆయన్ను క్షణంలో ఆవహిస్తోంది. మరుక్షణంలో తమాయించుకుని గుండె చిక్కపట్టుకుని ఎంతో నిబ్బరంగా వుండామని ప్రయత్నం చేస్తున్నాడు. అటూయిటూ ఊగిపోతున్నాడు.

ఆయన పరిస్థితి చూస్తుంటే ఆమెకు ఆందోళన కలుగుతోంది. ఏం చెయ్యాలో తోచటం లేదు. ఇద్దరూ చెరొక చెయ్యి పట్టుకుని ఆయన్ని కుర్చీలోంచి క్రిందపడకుండా సరిగ్గా కూర్చోపెట్టారు.

చెయ్యి ఊపుతూ ఫరవాలేదన్నట్లు నిలకడగా కూర్చుని, మంచి నీళ్ళకోసం సంజ్ఞచేసి రెండు గ్లాసుల నీళ్ళు త్రాగాడు.

'ఏమిటండీ యిట్లా అయిపోయారు.'

'నా కప్పుడప్పుడు యిట్లాగే వస్తూ వుంటుందిలే. కాసేపట్లో అదే సర్దుకుంటుంది. అంతే. మీరేమీ గాభరాపడకండి...' మొహమంతా తుడుచు కుంటూ మళ్ళీ మామూలు స్థితిలోకి రావటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

'అమ్మయ్య! నేనెంత భయపడ్డాననుకున్నారు... గుండెమీద చెయ్యి వేసుకుని పెద్దగా నిట్టూర్చింది ఆమె.

'అయ్యగారూ! మీతో ఓ మాట చెపుతాను ఏమీ అనుకోరుగదా... ఏం లేదు. మా అమ్మగార్కి ఏమిటో ఆవేశం. ఏం చేస్తుందో ఆమెగార్కే తెలీదు. ఎంతోమంది మగవార్ని రకరకాలుగా ఆకర్షిస్తుంది. వాళ్ళొచ్చి కావలసినంత డబ్బిస్తారు. ఏవేమిటో అంటారు. కొంత మందిని అల్లరి పెట్టి పంపిస్తుంది. కొంతమందిని ఎగతాళిచేసి పంపించేస్తుంది. ఇట్లా ఎంత కాలం. నిక్షేపంగా ఎవర్నైనా పెళ్ళి చేసుకుని హాయిగా జీవితం గడప మంటే నన్ను కసిరికొడుతుంది. ఆమెకు నేను, నాకు ఆమె, ఇంతకంటె యెవ్వరూ లేరు. నన్ను రకరకాలుగా పరిచయం చేస్తూ వుంటుంది. ఈ మధ్యనే ఒక రౌడీ మమ్మల్ని బెదిరించి మీ అంతు చూస్తాను అంటూ వెళ్ళిపోయాడు. నాకేమిటో భయంగా వుంది. మీరైనా ఆమెగార్కి నచ్చ చెప్పండి'... ప్రాధేయ పడింది.

'దీని కెప్పుడూ భయమే. ఉహూఁ. ఎవరా రౌడీ వస్తాడో నేనూ

చూస్తాను...ఇదంతా యెందుకు కానీండి...చెప్పండి. మీక్కావాలా ...' చటుక్కున అన్నది, ఆమె.

'...ఇహ నేను యెవ్వరికీ యే పాఠాలు చెప్పను. చెప్పలేను. నైతిక విలువలను గురించి చెప్పే హక్కు నాకు లేనేలేదు. మీ ఆవేదన నాకు పూర్తిగా అర్థమయింది. నేను ఎంతో నిబ్బరం గల మనిషినని పేరు తెచ్చుకున్నాను. కాని అది నిజానికి నిబ్బరం కాదు. అది కేవలం మూర్ఖత్వం. నేను చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెప్పుకునే సమయం వచ్చింది. నేనేమంటున్నానో నాకే తెలీటంలేదు...ఇహ నే నిక్కడ ఒక్క క్షణంకూడా వుండలేను. నేను యేం చెయ్యాలో నన్ను ఆలోచించనీయండి' మెల్లిగా లేచాడు.

వాళ్ళుకూడా ఆలోచనల్లో మునిగిపోయి లేచి నిలబడ్డారు,

అడుగుతీసి అడుగువేస్తూ బరువుగా గడపదాటాడు. ఆమె ఆశ్చర్యంగా ఆయనవైపుకే చూస్తూ నిలబడ్డది.

'వస్తాను...మళ్ళీ వస్తాను. తప్పక వస్తాను...' అంటూ లోపల లోపల సణుక్కుంటున్నాడు.

నాలుగడుగులు ముందుకు వేసి ఒక్క క్షణం నిలబడి వెనక్కు తిరిగి చూశాడు. ఆమె కనపడలేదు. ఆమె నిలబడ్డ స్థానంలో సుగుణ కనిపించింది. రెండు చేతులూ చాచి 'తప్పక వస్తారు కదూ. నన్ను పెళ్ళి చేసుకుంటారు కదూ' అంటూ ప్రాధేయపడుతున్నట్లుగా కనిపించింది.

చకచక అడుగులు వేసుకుంటూ చరచర నడిచాడు ఆనందరావు. 'నువ్వా శారదా నువ్వా!' అని ఉద్వేగంగా అనుకుంటూ.

****